క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అనారోగ్య బారిన పడిన బాధిత కుటుంబాలకు ప్రభుత్వం విడుదల చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిట్టంపల్లి అయిలయ్య మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ప్రజాపాలన కొనసాగుతుందని అన్నారు. బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు తాళ్లపల్లి సదానందం, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న ఎన్టీఆర్ ఫ్యాన్స్

శాయంపేట : సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్స్ మండల అధ్యక్షుడు దాసరి నరేష్ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సామాజిక సేవకుడు అమ్మ అశోక్ పాల్గొని ఆస్పత్రిలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జూనియర్ ఎన్టీఆర్ దేవుడి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో దాసరి విష్ణు, సాల్లేటి సతీష్, ప్రణయ్, సాయి, నాగరాజు, మోహన్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

వరిసాగుతో భూగర్భ జలాల క్షీణత



మాట్లాడుతున్న డాక్టర్ హరికృష్ణ

నడికూడ : మండలంలోని వరికోల్ గ్రామంలో మంగళవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి పోరిక జైసింగ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ హరికృష్ణ, గోపిక పాల్గొని మాట్లాడుతూ వరి సాగుతో భూగర్భ జలాల క్షీణత ఏర్పడుతుందని, వరి తర్వాత యాసంగిలో వేసుకున్నట్లయితే నీటి వినియోగం తగ్గుతుందన్నారు. తక్కువ యూరియా వాడకం, సాగు ఖర్చులను తగ్గించడం, అవసరం మేరకు రసాయనాల వినియోగం, రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల రశీదుల పై, పంటమార్పిడిపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు..ఈ కార్యక్రమంలో ఏఈలు, వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

శాయంపేట : చట్టాలపై మహిళలు ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సఖీ కేస్ వర్కర్ అనూష అన్నారు. మండలంలోని కొత్తగట్టు సింగారం గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో మంగళవారం సఖి వన్‌స్టాప్ సెంటర్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ మహిళలకు న్యాయ, వైద్య, పోలీస్, కౌన్సెలింగ్, తాత్కాలిక వసతి, ఐదు రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఓ గంగాజమున, సఖీ సిబ్బంది స్వర్ణలత, మానస తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో అక్రమంగా నిల్వ ఉంచిన గుడుంబాను స్థానిక పోలీసులు మంగళవారం దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. నీరుకుళ్లకు చెందిన ఉడుత స్వర్ణ ఇంట్లో 32 లీటర్ల గుడుంబా (16 ప్యాకెట్లు) లభించగా స్వాధీనం చేసుకొని అరెస్టు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు.

ఆయిల్ పామ్ సాగుతో అధిక లాభాలు

హసన్‌పర్తి: ఆయిల్ పామ్ తోటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని హనుమకొండ డివిజన్ ఉద్యానశాఖ అధికారి సుష్మిత అన్నారు. ఆయిల్ పామ్ సాగుపై హసన్‌పర్తి మండలం గంటూరుపల్లిలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానశాఖ, కేఎన్ బయోసైన్స్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ టన్ను ధర రూ.21 వేలు ఉందని చెప్పారు. భీమదేవరపల్లిలోని కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలంలోని బాహుపేటలో ఆయిల్‌పామ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు.

నేటినుంచి సైలానిబాబా ఉర్సు

- వివిధ రాష్ట్రాల నుంచి హాజరుకానున్న భక్తులు
- ప్రత్యేక ఆకర్షణగా మహారాష్ట్ర బ్యాండ్, ఫకీర్ల విన్యాసాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



సైలానిబాబా దర్గా ప్రధాన ద్వారం



సైలానిబాబా దర్గా



దర్గాలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, తదితరులు

దామెర: మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని సైలానిబాబా దర్గాలో 118వ హజ్రత్ సైలానిబాబా గంధం (ఉర్సు) ఉత్సవాలు నేటి (బుధవారం) నుంచి ప్రారంభం కానున్నాయని దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్ హమీద్ తెలిపారు. బుధవారం రాత్రి గంధం జాతర ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుండిచి తరలివచ్చిన భక్తులు డప్పుచప్పుళ్ల మధ్య దర్గా ప్రధాన ద్వారం నుంచి ఊరేగింపుగా వచ్చి, వారు తీసుకొచ్చిన చాదర్లను భక్తి శ్రద్ధలతో సమర్పిస్తారు. అనంతరం గంధం తీసుకొచ్చే తంతు కోలాహలంగా నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో భాగంగా మహారాష్ట్ర నుంచి ప్రత్యేకంగా తీసుకొచ్చిన బ్యాండు కళాకారుల నృత్యాలు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫకీర్ల విన్యాసాలు భక్తులకు కనువిందు చేస్తాయని అన్నారు. తెల్లవార్లు జరిగే ఈ గంధం ఉత్సవం ప్రత్యేకంగా అలంకరించిన ఒంటెలపై తీసుకొచ్చిన గంధం దర్గాలో సంప్రదాయరీతిన సమర్పిస్తారు. అనంతరం సైలానిబాబాతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పీఠాధిపతులు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని బాబా ఆశీర్వాదం తీసుకుంటారు. ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం రాత్రి మహబూబ్‌నగర్‌కు చెందిన జనాబ్ షుజాత్ నియాజీ బృందంచే భక్తులను ఆకట్టుకునే విధంగా ఖవ్వాలీ కళాకారులచే ప్రదర్శనలు ఉంటాయన్నారు. వేడుకల్లో 3వ శుక్రవారం తహెల్ ఫాతేహా కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేస్తామని వెల్లడించారు.

రాష్ట్రం నలుమూలల నుంచి భక్తుల రాక

మూడు రోజుల పాటు జరిగే గంధం ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచి జాతరకు సుమారు రూ. 2 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా. ప్రతి సంవత్సరం ఉమ్మడి రాష్ట్రంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ నుంచి కూడా భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మూడు రోజులపాటు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులను ఆకట్టుకునే విధంగా దర్గా ప్రాంతమంతా విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించినట్లు పేర్కొన్నారు. హనుమకొండ, పరకాల, ఏటూర్‌నాగారం నుంచి వచ్చే ప్రతి ఆర్టీసీ బస్ దర్గా వద్ద ఆగే విధంగా ఏర్పాటు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తారని పేర్కొన్నారు. రశీద్ బాబా, అమీర్ బాబా, ఎస్కే మోయిన్ సైలానిబాబా ఖాదీం ఉన్నారు.

ఉర్సు జాతర ఏర్పాట్ల పరిశీలన

మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలోని సైలానీబాబా దర్గాలో నేటి (బుధవారం) నుంచి నిర్వహిస్తున్న ఉర్సు జాతర ఏర్పాట్లను మంగళవారం పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పరిశీలించారు. పీఠాధిపతి మహ్మద్ అబ్దుల్ హమీద్‌తో కలిసి దర్గా పరిసర ప్రాంతాలు పరిశీలించారు. జాతర విజయవంతానికి తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసులను ఆదేశించారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట ఆర్డీఓ నారాయణ, విద్యుత్ ఏఈ గుర్రం రమేశ్, ఎస్సై కొంక అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, సయ్యద్ మసూద్, పోతుల కొమ్మాలు తదితరులు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని, ప్రజల్లో మంచితనం ఉన్నవారికే అవకాశాలు ఉంటాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలు క్షేత్రస్థాయి నుంచి పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయం పాటించడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారని గుర్తు చేశారు. అనంతరం మండలంలో వివిధ గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ. 16లక్షల70వేల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ కోసమే పాదయాత్రలు

భారత రాజ్యాంగ పరిరక్షణ కోసమే కాంగ్రెస్ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం ఎస్వీకేకే ఫంక్షన్ హాల్ నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా పాదయాత్రలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ మెంబర్ బాసాని చంద్రప్రకాశ్, జిల్లా నాయకులు పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, చల్లా చక్రపాణి, బోనెపల్లి రఘుపతి రెడ్డి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, అబ్బు ప్రకాశ్ రెడ్డి, కొమ్ముల భాస్కర్, దుబాసి కృష్ణమూర్తి, కట్టయ్య, వరదరాజు తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశంలో వసతులు కల్పించాలి

- జెడ్పీ సీఈఓ విద్యాలత



ఉపాధి పనులు పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ విద్యాలత

అత్మకూరు: ఉపాధి కూలీలకు పని ప్రదేశంలో వసతులు కల్పించాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. మండలంలోని తిరుమలగిరితో పాటు మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలను ఆమె మంగళవారం సందర్శించారు. తిరుమలగిరిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. వర్షపు నీటి సేకరణ నిర్మాణాలను, నర్సరీలను, ఆత్మకూరులో నిర్మించనున్న ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ స్థలాన్ని పరిశీలించారు. ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు పనిచేసే చోట నీడ మంచినీరు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి కూలీలకు రూ.307 వచ్చేలా కొలతలు చేసి పనులు అప్పగించాలన్నారు. ఎండ తీవ్రత కాకముందే పనులు ముగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, ఈజీఎస్ ఈసీ రాము, పంచాయతీ కార్యదర్శులు శ్వేత, అనూష, జీపీ సిబ్బంది రాజేశ్వర రావు, రాంబాబు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు మానుకోవాలి



మాట్లాడుతున్న రైతులు

దామెర : తమ వ్యవసాయ భూములకు వెళ్లే విధంగా రోడ్డు నిర్మాణం చేసుకునే క్రమంలో గిట్టనివారు అసత్యప్రచారాలు చేయడం సరికాదని దామెర రైతులు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు రైతులు మాట్లాడుతూ గ్రామం నుంచి వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే మార్గం పూర్తిగా గుంతలమయంగా మారిందని అన్నారు. కాగా అటువైపుగా వెళ్లే రైతులందరూ స్వచ్ఛందంగా డబ్బులు వేసుకొని తాత్కాలిక రోడ్డును నిర్మించుకుంటున్నారు. కాగా అధికార పార్టీకి చెందిన వసూల్ రాజాలు అంటూ సోషల్ మీడియాలో కొంత మంది అసత్య ప్రచారాలు చేస్తున్నారని వాపోయారు. ఎవరి ఒత్తిడి లేకుండా తామే రోడ్డు నిర్మాణం కోసం డబ్బులు వసూలు చేస్తున్నామని పేర్కొన్నారు. తప్పుడు ప్రచారం మానుకోవాలని, తాము ఎవరికి డబ్బులు ఇవ్వలేదని పేర్కొన్నారు. సమావేశంలో రైతులు సదయ్య, చేరాలు, సుధాకర్, స్వామి, సహోదర్, రాంచందర్, రమేష్, కుమారస్వామి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మసాగర్ : మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల నిధుల కేటాయింపు కోసం గ్రామంలోని యువత స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మంగళవారం హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని డబుల్ రోడ్డుగా విస్తరించి, సెంట్రల్ లైటింగ్ మంజూరు చేయాలని, మోడల్ కాలనీకి సీసీ రోడ్లు, సైడ్ డ్రెయినేజీల కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించి కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గ్రామంలో చేపల, కూరగాయల మార్కెట్‌కు స్థలం కేటాయించి మార్కెట్లు ఏర్పాటు చేయాలని, మండలంలోని యువత కోసం క్రీడా ప్రాంగణం (మినీ స్టేడియం) కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీ హరి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే ఇట్టి అభివృద్ధి పనుల కోసం నిధులు మంజూరు అయ్యేలా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అడిగొప్పుల ప్రవీణ్, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి చిలుక విన్ను, యువజన కాంగ్రెస్ నాయకులు ఎండీ.ముజ్జు, బొల్లం సాంబరాజు, నాగవెల్లి ప్రశాంత్, బొడ్డు ప్రశాంత్, గంటె సాంబరాజు, రఘుపతి రెడ్డి, రాజేష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

గొల్ల, కురుమ యువతకు ఉపాధి కల్పించాలి



మాట్లాడుతున్న కాడబోయిన లింగయ్య

వేలేరు : గొల్ల, కురుమ యువతకు గొర్రెల ఫామ్‌లను 75 శాతం సబ్సిడీపై మంజూరు చేసి ఉపాధి కల్పించాలని గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ గొల్ల, కురుమ కుటుంబాల్లో చదువుకున్న యువతకు ఉపాధి లేక ఆటో డ్రైవర్లుగా, వ్యవసాయ కూలీలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారుతున్నా గొల్ల,కురుమలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని అన్నారు. పార్టీలు గొల్ల, కురుమలను కేవలం ఓట్ల కోసమే వాడుకుంటున్నాయని అన్నారు. గొర్రెలు, మేకలకు సీజన్ వారీగా వస్తున్న రోగాలకు ప్రభుత్వమే ఉచితంగా మందులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం ఈనెల 25 న మండల గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం సదస్సును నిర్వహించాలని మండల కమిటీ నిర్ణయించింది. కార్యక్రమంలో జీఎంపీఎస్ నాయకులు బంక శ్రీనివాస్, తెల్ల శ్రీకాంత్, కనుకరాజు, భిక్షపతి, వెంకన్న, శ్రవణ్, గాలయ్య పాల్గొన్నారు.

నూతన పద్ధతుల్లో విద్యా బోధన చేపట్టాలి

- ఎంఈఓలు సత్యనారాయణ, సునీతారాణి



ఎల్కతుర్తి: ఆదర్శ పాఠశాలలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఈఓ సత్యనారాయణ

ఎల్కతుర్తి: ఉపాధ్యాయులు నూతన పద్ధతుల్లో విద్యా బోధన చేసేందుకు అవగాహన కలిగి ఉండాలని ఎల్కతుర్తి, భీమదేవరపల్లి ఎంఈవోలు చదువుల సత్యనారాయణ, సునీతారాణి సూచించారు. మంగళవారం ఎల్కతుర్తి తెలంగాణ ఆదర్శ పాఠశాలలో, భీమదేవరపల్లి మండలం గట్టునర్సింగాపురం ఉన్నత పాఠశాలలో వివిధ గ్రామాల్లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు, సెంకడరీ ఉపాధ్యాయయులకు, జిల్లా కేంద్రంలో శిక్షణ పొందిన సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్స్‌తో శిక్షణ శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులనుద్దేశించి ఎంఈఓలు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల ప్రగతి స్థాయి పెరిగిన సందర్భంగా వారిని దృష్టిలో పెట్టుకొని సబ్జెక్టులలో బోధన మెరుగు పర్చుకోవాలని సూచించారు.



దామెర : ప్రారంభిస్తున్న ఎంఈఓ రాజేశ్ కుమార్

గుణాత్మక విద్యపై దృష్టి సారించాలి

దామెర: ఉపాధ్యాయులు గుణాత్మక విద్యపై దృష్టి సారించాలని మండల విద్యాశాఖాధికారి లకావత్ రాజేశ్ కుమార్ అన్నారు. మండలకేంద్రం సమీపంలోని ఏకశిలా ప్రైమ్ స్కూల్‌లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, సెకండరీ గ్రేడ్ టీచర్లకు ఐదు రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. సమావేశంలో పాఠశాల డైరెక్టర్ బేతి కొండల్‌రెడ్డి, రిసోర్స్‌పర్సన్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో ఉత్తమ ఫలితాల సాధన

శాయంపేట : విద్యారంగంలో ఉత్తమ ఫలితాల సాధనకు శిక్షణలు దోహదపడుతాయని ఎంఈఓ, శిక్షణ కోర్సు డైరెక్టర్ గడ్డం భిక్షపతి అన్నారు. స్థానిక ఎంఈఓ కార్యాలయం ఆవరణలో మంగళవారం మండలంలోని ఉపాధ్యాయులకు ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో శిక్షణ ఆర్పీలు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగ విత్తనాలు



ఎల్కతుర్తి: జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న సింగిల్‌విండో చైర్మన్ రవీందర్‌గౌడ్

ఎల్కతుర్తి/పరకాల/శాయంపేట/వేలేరు/ఐనవోలు: వ్యవసాయ భూముల్లో భూసారం పెంచుకునేందుకు రైతులకు జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు ఎల్కతుర్తి సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, పరకాల, శాయంపేట, ఐనవోలు, వేలేరు వ్యవసాయ శాఖ అధికారులు ఎస్.శ్రీనివాస్, గంగా జమున, సునీల్‌కుమార్, కవిత మంగళవారం తెలిపారు. మండల కేంద్రాల్లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో, పీఏసీఎస్ కేంద్రాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉంచినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు వర్షం కురువగానే పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలు చల్లుకోవాలని దీని ద్వారా భూమి సారవంతమై అధిక దిగుబడి సాధించవచ్చని సూచించారు. ఒక్కో బస్తా 30 కిలోలు ఉండగా, బస్తా ధర రూ.2,137.50 ప్రభుత్వం ధర నిర్ణయించిందని తెలిపారు. సబ్సిడీపై జీలుగ విత్తనాలు కావాల్సిన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో వచ్చి తీసుకోవాలని సూచించారు. ఆయా మండలాల్లోని రైతులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎల్కతుర్తి ఎంఈఓ తిరుపతి, బ్యాంక్ సీఈఓ తిరుపతి, సిబ్బంది పాల్గొన్నారు.



పరకాల : జీలుగ విత్తనాలతో ఏఓ శ్రీనివాస్



ఐనవోలు : జీలుగ విత్తనాల అమ్మకాలను ప్రారంభిస్తున్న ఏఓ సునీల్ కుమార్

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేశ్
- స్థానిక మార్కెట్ యార్డు ఎదుట ధర్నా



ఎల్కతుర్తి: మార్కెట్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

ఎల్కతుర్తి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జాతీయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. కార్పొరేట్ యాజమాన్యాలకు, పెట్టుబడి దారులకు అనుకూలంగా చట్టాలను మారుస్తూ కార్మికుల శ్రమ దోపిడీకి గురిచేస్తుందని మండిపడ్డారు. ధరలను నియంత్రించడంలో విఫలం చెందిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు ఎక్కువగా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి పుల్లా అశోక్, మండల నాయకులు శనిగరం రాజయ్య, రాజ్‌కుమార్, యాదగిరి, సమ్మయ్య, రాజయ్య, కిరణ్, పాల్గొన్నారు.

కమలాపూర్, మర్రిపల్లిగూడెంలో నిరసన

కమలాపూర్ : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన కార్మిక చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమాల్లో భాగంగా కమలాపూర్‌తో పాటు మండలంలోని మర్రిపల్లిగూడెంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నిరసన కార్యక్రమాల్లో సీఐటీయూ నాయకులు సుదర్శన్, విజేందర్, రామస్వామి, ప్రశాంత్, వెంకటేష్, రాజేందర్, రవి, రమేష్, వీరస్వామి, ఐలయ్య, కుమార్, అనిల్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు సడలించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

వేలేరు : మండలంలోని శాలపల్లిలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో 600 ఎస్ఎఫ్‌టీ కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి నిబంధనలు సడలించి బిల్లులు మంజురు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు కాట్రేవుల రాజు అన్నారు. ఈ సందర్భంగా పార్టీ ఆధ్వర్యంలో అధికారులకు వినతిప్రతం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొంత మంది ఉమ్మడి కుటుంబాలు ఇందిరమ్మ ఇంటిని పెద్దగా నిర్మించుకుంటుండటంతో వారికి అధికారులు బిల్లులు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనుకచారి, శివాజీ, రాము తదితరులు పాల్గొన్నారు.